సాక్షి చిత్తూరు

మంగళవారం । 5 । మార్చి । 2024



మహిళల ఆర్థికాభివృద్ధికే..

అతివల ఆర్థికాభివృద్ధికే ప్రభుత్వం జగనన్న మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేసినట్లు మంత్రి రోజా తెలిపారు. - 8లో



'హబ్'గా కార్పెంటర్ ఎస్టేట్

జగనన్న కార్పెంటర్ ఎస్టేట్‌ను ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. - 8లో



వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు

పెద్దపంజాణి మండలానికి చెందిన పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో సోమవారం చేరారు. - 8లో

న్యూస్‌రీల్

బోయకొండకు 'సోలార్' వెలుగులు

– నేడు ప్రారంభించనున్న మంత్రి పెద్దిరెడ్డి



బోయకొండ గంగాపురంలో సోలార్ ప్లాంట్

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయ అభివృద్ధికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విశేషంగా కృషి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బోయకొండ గంగాపురంలో రూ.1.90 కోట్లు వెచ్చించి ఏర్పాటుచేసిన సోలార్ ప్లాంట్‌ను మంగళవారం ఉదయం 11 గంటలకు మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఆలయానికి సోలార్ విద్యుత్ అందుబాటులోకి వస్తే రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఆదాయం సమకూరనున్నట్లు వివరించారు. ఈ క్రమంలోనే ఆహ్లాదకరమైన వాతావరణంలో భక్తులు సేద తీరేందుకు రూ.25లక్షలతో తీర్చిదిద్దిన పార్క్‌ను సైతం మంత్రి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు బోయకొండలో సర్వం సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

భవిష్య నిధి పంపిణీ



డీడీలు అందజేస్తున్న మేయర్, అధికారులు

చిత్తూరు అర్బన్: నగర పాలక సంస్థ ఉద్యోగుల భవిష్యనిధి (పీఎఫ్) నగదును సోమవారం పంపిణీ చేశారు. మేయర్ ఎస్.అముద, కమిషనర్ జె అరుణ, డిప్యూటీ మేయర్ ఆర్. చంద్రశేఖర్ చేతుల మీదుగా ఉద్యోగ విమరణ పొందిన సిబ్బంది, మృతి చెందిన ఉద్యోగుల కుటుంబీకులకు డీడీలు అందించారు. నగరపాలక సంస్థకు సంబంధించి ఉద్యోగుల పీఎఫ్ నిధులు యాక్సిస్ బ్యాంకులో ఏడాదిగా స్తంభించడంతో కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు విడుదల చేయించారు. మొత్తం 297 మందికి గాను రూ.1.72కోట్లను ఉద్యోగుల నూతన ఖాతాల్లోకి జమ చేయించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ షర్మిల ప్యారీ, ఎంఈ గోమతి, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, అకౌంట్స్ విభాగం కోదండన్ పాల్గొన్నారు.

పల్లె ప్రగతికి కృషి



మాట్లాడుతున్నరత్నకుమారి

చిత్తూరు కార్పొరేషన్: పల్లెల ప్రగతికి అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకునేందుకు కృషి చేయాలని 5వ ఆర్థిక సంఘ కమిషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ రత్నకుమారి తెలిపారు. సోమవారం చిత్తూరులోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో జెడ్పీ సీఈఓ గ్లోరియా, డీపీఓ లక్ష్మి, ఇతర అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామ, మండల, జిల్లా పరిషత్ పరిధిలో ఆదాయం, ఖర్చుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జెడ్పీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను సీఈఓ గ్లోరియా వివరించారు. కార్యక్రమంలో డీపీఆర్సీ డీసీ షణ్ముగం పాల్గొన్నారు.

15 వరకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్



మాట్లాడుతున్న అపోలో నిర్వాహకులు

చిత్తూరు రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అపోలో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నరేష్‌కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం క్యాంపును ప్రారంభించిన తర్వాత ఆయన మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్క్రీనింగ్ పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. నిర్వాహకులు రాంభూపాల్‌రెడ్డి, సుధాకర్‌బాబు, జోత్స్న, అఫ్రిన్ పాల్గొన్నారు.

'సూర్యఘర్'కు దరఖాస్తులు

చిత్తూరు కార్పొరేషన్: ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కోసం పోస్టాఫీసుల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తపాలా శాఖ చిత్తూరు డివిజన్ సూపరింటెండెంట్ లక్ష్మణ సోమవారం తెలిపారు. ప్రతి ఇంటికీ 300 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించేలా ఇంటి పై కప్పుపై సోలార్ ప్యానళ్లు ఏర్పాటే పథకం ఉద్దేశమని వెల్లడించారు. విద్యుత్ బిల్లు, సెల్ నంబర్, ఇంటి పైకప్పు ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అభివృద్ధి అదిరె..!



లబ్ధిదారులకు అందించిన టిడ్కో ఇళ్లు



రాయలవారి విగ్రహావిష్కరణలో మంత్రి పెద్దిరెడ్డి (ఫైల్)

మారుమూల నియోజకవర్గం.. 30 ఏళ్లుగా అభివృద్ధి శూన్యం.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే పురోభివృద్ధి పరుగులు తీస్తోంది.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో పుంగనూరు ప్రగతి పథంలో సాగుతోంది.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి అవిశ్రాంత కృషితో ముందంజలో దూసుకెళుతోంది.. కళ్లు చెదిరేలా నిర్మించిన టిడ్కో ఇళ్లు నిరుపేదల సొంతింటి కలలను సాకారం చేశాయి. ఇరుకు రోడ్లు విశాలంగా మారాయి.. రూ.కోట్ల నిర్మాణాలు ఆవిష్కృతమయ్యాయి.. దాహార్తిని తీర్చే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు సాక్షాత్కరించాయి.. అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయి.. సకల కులాలకు స్థల కేటాయింపులు జరిగాయి.. కమ్యూనిటీ భవనాలకు నిధులు మంజూరయ్యాయి.. మహనీయుల విగ్రహాలతో కూడళ్లు అద్భుతంగా ఆకట్టుకుంటున్నాయి.. ఒకప్పుడు కనీస వసతులకు నోచుకోని పుంగనూరు.. నేడు పురోగతి బాటలో పయనిస్తూ పులకరిస్తోంది.

- ఆదర్శవంతంగా పుంగనూరు ప్రగతి
- అన్ని వర్గాలకు కమ్యూనిటీ భవనాలు
- కులాల వారీగా స్థలాల కేటాయింపు
- రూ.వేల కోట్లు వెచ్చించిన ప్రభుత్వం
- సొంత నిధులనూ ఖర్చు చేసిన మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి

పుంగనూరు : గత పాలకుల నిర్లక్ష్యానికి గురై కునారిల్లుతున్న పుంగనూరు నియోజకవర్గం ఇప్పుడు అభివృద్ధికి చిరునామాగా మారింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లుగా వేలాది కోట్ల రూపాయలు విడుదల చేయడంతో పుంగనూరు రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ముఖ్యంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను సద్వినియోగం చేసుకుంటూనే తమ భాస్కర్‌రెడ్డి ట్రస్ట్ ద్వారా ఇప్పటి వరకు సుమారు రూ.23.08 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు.

స్థలాలు.. భవనాలు

పుంగనూరు నియోజకవర్గంలో మున్సిపాలిటీ, రూరల్ మండలంతో పాటు చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలు ఉన్నాయి. లయన్స్ క్లబ్‌కు రాంపల్లె వద్ద సుమారు రూ.50 లక్షలు స్థలాన్ని మంత్రి పెద్దిరెడ్డి కేటాయించారు.

షాదీమహాళ్ల నిర్మాణానికి నిధులు

పుంగనూరులో షాదీమహాల్‌కు రూ.2.25 కోట్లు, అంజుమన్ కమిటీకి రూ.50 లక్షలు విలువైన స్థలం కేటాయించారు. కుమ్మరవీధిలో కమ్యూనిటి భవనానికి రూ.18 లక్షలు, బీడీ కాలనీలో రూ.10 లక్షలు, శాంతినగర్‌లో రూ.5 లక్షలు, రాంనగర్‌కాలనీలో భవన నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేశారు. పట్టణంలోని మండల కాంప్లెక్స్ వద్ద సుమారు రూ.50 లక్షలు విలువైన స్థలం కేటాయించారు. చౌడేపల్లె మండలంలోని చెడుగుట్లపల్లె వద్ద షాదీమహల్ నిర్మాణానికి రూ.1.50 కోట్లు, మేదరదొడ్డిలో మసీదు నిర్మాణానికి రూ.1.50 కోట్లు, జాండ్రవారిపల్లె, బండకిందపల్లెరూ.50 లక్షలు, సోమల, ఉప్పరపల్లెలో షాదీమహళ్ల నిర్మాణానికి రూ.50లక్షల చొప్పున అందించారు. కందూరులో షాదీమహల్ అదనపు గదుల నిర్మాణానికి రూ.25 లక్షలు, రొంపిచెర్లలో షాదీమహల్‌కు రూ.1.20 కోట్లు, అలాగే సదుం మండలం బట్టువారిపల్లెలో నిర్మాణానికి రూ.90 లక్షలు మంజూరు చేశారు. అలాగే ఏటా రంజాన్ పండుగ సందర్భంగా మసీదుల మరమ్మతులకు మంత్రి పెద్దిరెడ్డి తన సొంత నిధుల నుంచి రూ.లక్షలు విరాళంగా అందిస్తుండడం విశేషం.



సదుంలో నిర్మించిన షాదీమహాల్

డయాలసిస్ సెంటర్ కోసం రూ.60 లక్షలు నిధులు అందించారు. దీంతో క్లబ్ వారు సుమారు రూ.3 కోట్లతో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశారు. క్రైస్తవుల కమ్యూనిటీహాల్‌కు రూ.20 లక్షలు, నాయీబ్రాహ్మణులకు రూ.5 లక్షలతో త్యాగరాజ భవన నిర్మాణం, దోబీఘాట్‌కు రూ.5 లక్షలు, మొదలియార్ల సంఘానికి రూ.30 లక్షలు, ఆర్యవైశ్య సంఘానికి రూ.5 లక్షలు, బ్రాహ్మణ సంఘానికి రూ.30 లక్షలు,, వాల్మీకి సంఘానికి రూ.30 లక్షలు, రోటరీక్లబ్‌కు రూ.30 లక్షలు, మానవతా సంస్థకు రూ.30 లక్షలు, సుగుటూరు గంగమ్మ రైతు సంఘానికి రూ.50 లక్షల విలువైన స్థలాలు కేటాయించారు. గాండ్ల కులస్తుల కమ్యూనిటీ భవనానికి రూ.5 లక్షలు అందించారు. న్యాయవాదుల సంఘానికి రూ.50 లక్షలు విలువ చేసే స్థలం, భవన నిర్మాణానికి, రూ.45 లక్షలు మంజూరు చేశారు. ఆటోనగర్‌కు రూ.3 కోట్లు విలువ చేసే 1.50 ఎకరాల స్థలం, స్టేడియం కోసం రూ.కోటి, బలిజలకు రూ.50లక్షలు, క్షత్రియులు, రెడ్లకు రూ.50లక్షల చొప్పున విలువైన స్థలాలు అందించారు. చింతకాయ కార్మికులకు ఎకరా కేటాయించారు. రొంపిచెర్ల మండలంలో చేనేత కార్మికులకు రూ.10 లక్షలు, రజకుల కమ్యూనిటి భవనానికి రూ.20 లక్షలు అందజేశారు. పట్టణంలోని కోర్టు రోడ్డులో సుమారు రూ.60 లక్షలతో అంబేద్కర్ భవనం నిర్మించారు. అలాగే మండలంలోని చంద్రమాకులపల్లె, ఇటుకనెల్లూరు, మేలుందొడ్డిలో సైతం అంబేద్కర్ భవనాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆయా ప్రాంతాల్లో రాజ్యాంగ నిర్మాత విగ్రహాలకు సుమారు రూ.25 లక్షలు అందించారు. చౌడేపల్లెలో అంబేద్కర్ భవన నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరు చేశారు.

ఆలయాల జీర్ణోద్ధరణ

నియోజకవర్గవ్యాప్తంగా అన్ని ఆలయాల అభివృద్ధికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విశేషంగా కృషి చేశారు. సుమారు రూ.5కోట్ల సొంత నిధులతో శిథిలావస్థలోని ఆలయాల జీర్ణోద్ధరణ చేపట్టారు. పలు ఆలయాల నిర్మాణానికి సహకారం అందించారు. అందులో భాగంగా పుంగనూరు ఎన్ఎస్ పేటలోని ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు, హనుమంతరాయునిదిన్నిలో ఆంజనేయుని ఆలయ పునర్నిర్మాణానికి సుమారు రూ.2కోట్లు, , శ్రీకృష్ణ ఆలయం నిర్మాణానికి రూ.20 లక్షలు విరాళంగా అందజేశారు.

మహనీయుల విగ్రహాలు

పుంగనూరులోని ఎంబీటీ రోడ్డులో అంబేద్కర్ విగ్రహానికి రూ.15 లక్షలు అందించారు. చదళ్ల సర్కిల్‌లో సుమారు రూ.20 లక్షలు విలువ చేసే స్థలం కేటాయించి రూ.కోటి వెచ్చించి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం ఏర్పాటు చేశారు. అలాగే భీమగానిపల్లె వద్ద సుమారు రూ.కోటి విలువ చేసే స్థలం అందించడమే కాకుండా రూ.50లక్షలతో శ్రీకృష్ణదేవరాయుల విగ్రహం ఏర్పాటు చేయించారు. అరబిక్ కళాశాల వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహానికి సుమారు రూ.20 లక్షలు విలువ చేసే స్థలం కేటాయించారు. అలాగే మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలామ్ విగ్రహం కోసం స్థలం అందించాలని మంత్రి పెద్దిరెడ్డి నిర్ణయించారు.



పుంగనూరులో నిర్మించిన అంబేద్కర్ భవనం

మెకానిక్‌లకు ర్యాంపులు

పట్టణంలోని ద్విచక్ర వాహన మెకానిక్‌లు ర్యాంప్‌లు లేక ఇబ్బందులు పడేవారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ మిథున్‌రెడ్డి తన సొంత నిధులు రూ.20 లక్షలతో 100 మంది మెకానిక్‌లకు ర్యాంప్‌లు పంపిణీ చేశారు.



పుంగనూరులో రైతు భవన్‌కు భూమి పూజ చేసిన మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు (ఫైల్)



సువిశాలంగా ఎంబీటీ రోడ్డు

అడిగిన వెంటనే



"గత ప్రభుత్వాల హయాంలో మెకానిక్‌లను పట్టించుకునే వారు కాదు. కానీ, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పుంగనూరు పర్యటనకు వచ్చినప్పుడు ర్యాంప్‌లు కావాలని విన్నవించాం. అడిగిన వెంటనే ఆయన స్పందించి వందమంది మెకానిక్‌లకు ర్యాంపు అందిస్తామని భరోసా ఇచ్చారు. నెలలోపే రూ.20 లక్షలు విలువైన ర్యాంప్‌లను పంపిణీ చేశారు. ఎంపీ మిథున్‌రెడ్డి చేసిన మేలును ఎప్పటికీ మరువలేం.

–బండ కుమార్, మెకానిక్, పుంగనూరు

రుణపడి ఉంటాం



రాష్ట్రంలో బ్రాహ్మణుల కమ్యూనిటీ భవనానికి ఇంత వరకు ఏ ప్రభుత్వమూ స్థలం కేటాయించిన దాఖలాలు లేవు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మంత్రి పెద్దిరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి సుమారు రూ.30 లక్షలు విలువైన 25 సెంట్లు కేటాయించి, భవన నిర్మాణానికి భూమి పూజ సైతం చేశారు. ఇది కలలో కూడా ఊహించలేదు. కమ్యూనిటి భవనానికి ఆర్థిక సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వానికి, మంత్రి పెద్దిరెడ్డి కుటుంబానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం.

– ఆర్‌కే రామకృష్ణ, బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు, పుంగనూరు

కాణిపాకంలో సకల సౌకర్యాలు

- అద్భుతంగా వరసిద్ధుని ఆలయంలో అభివృద్ధి పనులు
- మంత్రులు కొట్టు సత్యనారాయణ, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పోటు భవనంలో నిర్వహిస్తున్న హోమ పూజల్లో మంత్రులు, ప్రజాప్రతినిధు

కాణిపాకం: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయాన్ని అద్భుతంగా అభివృద్ధి చేస్తామని, భక్తులకు అవసరమైన వసతులన్నీ కల్పిస్తామని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం వరసిద్ధుని ఆలయ పరిధిలో రూ.59.10కోట్లతో పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేపట్టారు. ఈ సందర్భంగా కాణిపాకం విచ్చేసిన మంత్రులకు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు ఘన స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. వేద పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు.

శంకుస్థాపనలు

ఆలయ ఆవరణంలో రూ.1.10కోట్లతో వీరాంజనేయ స్వామి ఆలయం, రూ.24కోట్లతో గణేష్ క్యూ కాంప్లెక్స్ , రూ.3.50కోట్లతో అతిథిగృహం, రూ.1.10 కోట్లతో నిత్యాన్నదాన ప్రసాద భవనం, రూ.3.30 కోట్లతో స్నానఘట్టాలు, , రూ.25లక్షలతో వంద అడుగుల స్వామివారి విగ్రహం, జాతీయ రహదారి వద్ద రూ.3.25కోట్లతో ప్రహరీగోడ నిర్మాణ పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, కలెక్టర్ షణ్మోహన్, డీఎఫ్ఓ చైతన్యకుమార్ రెడ్డి,ప్రారిశ్రామిక వేత్తలు పైమాగం సుగుణాకర్ రెడ్డి, బీఎంఆర్ మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యులు సుచిత్ర, వైఎస్సార్‌సీపీ నేతలు తలుపులపల్లె బాబురెడ్డి, కుమార్‌రాజా, గణేష్ ప్రసాద్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు బుజ్జిరెడ్డి, రామచంద్రారెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జగన్నాథరెడ్డి పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో ఆలయాలు

రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో దేవాలయాలు నిర్మించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంకల్పమని మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. సోమవారం కాణిపాకంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని ప్రధాన ఆలయాల్లోనూ పూర్తి స్థాయిలో ప్రసాదం తయారీకి ప్రత్యేకమైన పోటు, క్యూ కాంప్లెక్స్‌లు, అన్నదానం స్టాల్స్, పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగానే కాణిపాకం ఆలయంలో రూ.152కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ఇందులో రూ.23కోట్లతో చేపట్టిన పనులు పూర్తయినట్లు వివరించారు. మరో రూ.18కోట్ల పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. రూ.44కోట్లుతో పలు పనులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. శ్రీకాళహస్తి, శ్రీశైలం, విజయవాడ. అన్నవరం, సింహచలం, ద్వారక తిరుమల ఆలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రూ.650 కోట్ల సీజీఎఫ్ నిధులను ఇందు కోసం వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు. టీటీడీ సౌజన్యంతో శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.3.75 కోట్ల వ్యయంతో దేవాలయాల నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. 2019 ఎన్నికల హామీల అమలులో భాగంగానే అర్చకులకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వేతనం పెంచినట్లు తెలిపారు. గతంలో చంద్రబాబు ఆలయాలను నేలకూల్చితే, వాటిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించారని వివరించారు.

ప్రారంభోత్సవాలు

ఆలయ ఆవరణలో రూ.4.86 కోట్లతో నిర్మించి లడ్డూ పోటు భవనాన్ని మంత్రులు ప్రారంభించారు. అనంతరం పోటులో ఏర్పాటు చేసిన హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.రూ.12.12కోట్లతో వినాయక సదన్‌లో నిర్మించిన భవనాలను ప్రారంభించారు. రూ.5కోట్లుతో నిర్మించిన నూరు అడుగుల రోడ్డును, రూ.30 లక్షలతో గోశాల, ప్రహరీగోడ, రూ.32 లక్షలతో చెత్త నుంచి సంపద తయారు చేసేందుకు బృందావనం నిర్మాణాలకు మంత్రులు ప్రారంభోత్సవం చేశారు.



ఆంజనేయ స్వామి ఆలయానికి భూమి పూజ చేస్తున్న మంత్రులు



మంత్రులు కొట్టు సత్యనారాయణ, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందిస్తున్న మోహన్ రెడ్డి, వెంకటేశు

గజ బాధితులకు పరిహారం



రైతులకు మెగా చెక్ అందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

కాణిపాకం: ఏనుగుల దాడిలో పంట నష్టపోయిన 1,021 మంది రైతులకు రూ.1.18 కోట్ల పరిహారం పంపిణీ చేశారు. సోమవారం ఈ మేరకు మంత్రులు కొట్టు సత్యనారాయణ, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మెగా చెక్ అందించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్, డీఎఫ్ఓ పాల్గొన్నారు.

8 మందికి షోకాజ్ నోటీసులు

చిత్తూరు కలెక్టరేట్ : సెక్టోరల్ అధికారులకు నిర్వహించిన ఎన్నికల శిక్షణకు హాజరుకాని 8 మందికి షోకాజ్ నోటీసులు జారీచేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. సోమవారం చిత్తూరులో సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో బంగారుపాళ్యం ఎంఈఓ రమేష్‌బాబు, ఐరాల ఎంఈఓ దామోదర్‌నాయుడు, పూతలపట్టు పీఆర్ ఏఈఈ ప్రసాద్‌నాయుడు, జీడీ నెల్లూరు ఏఈఈ అజయ్, పుత్తూరు పీఆర్ ఈఓ శ్రీనివాసులు, నగరి రూరల్ ఎంఈఓ శ్రీదేవి, పుంగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ తేజేశ్వరికి కలెక్టరేట్ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నారు.

క్లుప్తంగా

సత్వరమే సమస్యల పరిష్కారం



సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ జాషువా

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో ప్రజలు అర్జీల ద్వారా తెలియజేసిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డీఆర్‌ఓ పుల్లయ్య ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో ఆయన వినతులు స్వీకరించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ స్పందనలో ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. తర్వాత రశీదు తప్పనిసరిగా ఇవ్వాలని స్పష్టం చేశారు. స్పందనలో వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 327 వినతులు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు.

పోలీసు స్పందనకు 23 ఫిర్యాదులు

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయం (ఏఆర్)లో సోమవారం నిర్వహించిన స్పందనకు 23 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ జాషువా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. బాధితులతో ఏఎస్పీ మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు సంబంధిత స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రతి ఫిర్యాదును విచారించి పరిష్కరించాలని ఆదేశించారు.

ఎర్రచందనం పట్టివేత

పూతలపట్టు : మండలంలోని రంగంపేట క్రాస్ వద్ద పోలీసులు సోమవారం చేపట్టిన వాహన తనిఖీల్లో 8 ఎర్రచందనం దుంగలు పట్టుబడ్డాయి. తిరుపతి నుంచి చిత్తూరు వైపునకు వెళుతున్న కారులో తరలిస్తున్న ఎర్రదుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ పరారైనట్లు సీఐ ప్రసాద్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికే 'మార్ట్'



పుత్తూరులో జగనన్న మహిళా మార్ట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: ఆడపడుచుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న మహిళా మార్ట్‌లకు శ్రీకారం చుట్టిందని మంత్రి ఆర్కే రోజా తెలిపారు. సోమవారం పుత్తూరులో మహిళా మార్ట్‌ను ఆమె ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ పట్టణంలోని 900 డ్వాక్రా సంఘాల సభ్యుల భాగస్వామ్యంతో మార్ట్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రిలయన్స్, హెరిటేజ్, బిగ్‌బజార్ వంటి కార్పొరేట్ సూపర్ మార్కెట్లకు ధీటుగా జగనన్న మహిళా మార్ట్‌లు పురోగతి సాధిస్తున్నాయని వివరించారు. చంద్రబాబు రుణమాఫీ పేరుతో పొదుపు సంఘాలను మోసం చేస్తే, జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి, అసలు వడ్డీతో సహా నాలుగు విడుతల్లో రూ.25 వేల కోట్లకు పైగా చెల్లించారని తెలిపారు. చంద్రబాబు ఎగ్గొట్టిన రూ.3 వేల కోట్ల సున్నా వడ్డీని చెల్లించడంతో పాటు రూ. 4,900 కోట్లు మహిళలకు అందించారని వెల్లడించారు. అమ్మఒడి కింది రూ.26 వేల కోట్లు, వైఎస్సార్ చేయూత కింద రూ.19 వేల కోట్లు, కాపునేస్తం కింద రూ.2 వేల కోట్లు, ఈబీసీ నేస్తం కింద రూ.1,257 కోట్లను అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేశారని వివరించారు. డీబీటీ, నాన్‌డీబీటీ కింద రూ.4 లక్షల 25 వేల కోట్లను ఖర్చు చేస్తే అందులో 75 శాతం మహిళలకే అందించారని తెలిపారు. జగనన్న ప్రభుత్వంలో మంత్రిగా పనిచేస్తున్నందుకు గర్వపడుతున్నట్లు చెప్పారు. 600 హామీలను గాలికి వదిలేసిన మోసగాడు చంద్రబాబు అయితే, 99 శాతం హామీలను నెరవేర్చిన మొనగాడు జగనన్న అని కొనియాడారు. అనంతరం మార్ట్‌లో వస్తువులను కొనుగోలు చేసి తొలి బిల్లు చెల్లించారు. ఈ క్రమంలోనే జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మున్సిపాలిటీలో తడి–పొడి చెత్త సేకరించే 13 వాహనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మెప్మా మిషన్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి, పీడీ రాధమ్మ, మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి, చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్ డి. శంకర్, మెప్మా సిటీ మేనేజర్ ప్రమీల, కౌన్సిలర్లు రాధ, జయలక్ష్మి, జ్యోతి, ఏకాంబరం, నరసింహారావ్, బాలాజీ, నాయకులు మునిరత్నం, జయబాబు, శ్రీనివాసులురెడ్డి, మనోహర్‌రెడ్డి, లారీమోహన్, రమేష్‌బాబు పాల్గొన్నారు.



మార్ట్‌లో వస్తువులు కొనుగోలు చేసి తొలి బిల్లు చెల్లిస్తున్న మంత్రి రోజా

అత్యధిక మెజారిటీయే లక్ష్యం

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు నల్లేరుపై నడకే అయినా అత్యధిక మెజారిటీయే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలని మంత్రి ఆర్కే రోజా పిలుపునిచ్చారు. సోమవారం నగరిలోని మంత్రి కార్యాలయంలో పార్టీ పట్టణ కమిటీ నాయకులతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి జరిగిన మేలును వివరించి ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. అనంతరం పార్టీ పట్టణ అధ్యక్షుడు డి.శంకర్, ఉపాధ్యక్షుడు ఇ.చిరంజీవి, ఏ.రత్నం, జనరల్ సెక్రటరీలు కె.భాస్కర్‌రెడ్డి, ఏ.ఎస్.వెంకటేశ్‌రెడ్డి, ఎన్.చిరంజీవి, ఎన్.గంగయ్యనాయుడు, ఎస్.నాగరాజు, కార్యదర్శులు కె.తాతయ్య, డీఎస్.వెంకటేష్, పి.రవి, బి.చంద్రశేఖర్‌వర్మ, జి.సెల్వరాజన్, ఏ.లోకనాథం, కె.మునిరత్నంనాయుడు, పి.సునీల్, ఏ.సలీమ్, సహాయ కార్యదర్శులు టి.జి.శక్తివేల్, ఏ.శివకుమార్, పి.ఎం.కైలాసం, ఎస్.శివకుమార్, ఎం.ఎస్.దినేష్, ఏ.బాబు, షేక్‌మస్తాన్, ఏ.జయరామ్, డీ.ఎల్.రామన్, దావూద్‌జిన్నా, డి.శ్రీనివాసులురెడ్డిని మంత్రి ఘనంగా సత్కరించారు. అనంతరం నాయకులు మంత్రి రోజాను గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

'హబ్'గా కార్పెంటర్ ఎస్టేట్



శిలాఫలకం ఆవిష్కరణలో మంత్రి పెద్దిరెడ్డి, విజయానందరెడ్డి, బుల్లెట్ సురేష్

చిత్తూరు రూరల్: జగనన్న కార్పెంటర్స్ ఎస్టేట్‌ను ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం తిరుపతి–బెంగుళూరు రహదారిలో కార్పెంటర్స్ ఎస్టేట్‌ను ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ కార్పెంటర్లకు కేటాయించిన ఈ స్థలంలో వర్క్ షాపులు ఏర్పాటు చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. ఎస్టేట్‌లో సౌకర్యాల కల్పనకు పూర్తి సహకారం అందిస్తామని వెల్లడించారు. మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్ మాట్లాడుతూ ఈ ఎస్టేట్ ఏర్పాటుకు చొరవ చూపిన మంత్రి, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ రెడ్డప్ప, వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి, కలెక్టర్ షణ్మోహన్, పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార రాజా, కార్పెంటర్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి కుమరేశన్ పాల్గొన్నారు.

'ఆరణి'ది తీరని ద్రోహం

చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వైఎస్సార్‌సీపీకి తీరని ద్రోహం చేశారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండిపడ్డారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆదివారం జనసేనలోకి వెళ్లారని తెలిసిందన్నారు. అందుకే పార్టీ నుంచి వెంటనే సస్పెండ్ చేసినట్లు తెలిపారు. అవసరమైతే ఎమ్మెల్యేపై అనర్హత వేటు వేస్తామని స్పష్టం చేశారు.

వైభవంగా కుంభాభిషేకం



నృత్య ప్రదర్శన చేసిన విద్యార్థినులతో ఎమ్మెల్సీ భరత్

కుప్పం : పట్టణంలో పాతపేటలో ఉన్న సిద్ధేశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధరణ ముగియడంతో సోమవారం వైభవంగా మహాకుంభాభిషేకం నిర్వహించారు. కుప్పంతోపాటు, తమిళనాడు, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో కురబలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఏడేళ్లకు ఒక్కసారి నిర్వహించే సిద్ధేశ్వరుని మహోత్సవాల్లో ఎమ్మెల్సీ భరత్ కుటుంబసమేతంగా పాల్గొన్నారు. స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా చేపట్టిన నృత్యపోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు బహుమతులు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉత్సవాలకు తరలివచ్చిన అశేష కురబ కులస్తులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్, మున్సిపల్ చైర్మన్ సుధీర్ పాల్గొన్నారు.

316 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

బంగారుపాళెం: మండలంలోని నలగాంపల్లె వద్ద సోమవారం 316 బస్తాల అక్రమ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక సీఐ నాగరాజరావు తెలిపారు. తమిళనాడుకు చెందిన శరవణన్(34), నాగరత్నం(25)ను అరెస్టు చేశారు.

పకడ్బందీగా పది పరీక్ష నిర్వహణ



మాట్లాడుతున్న జిల్లా అబ్జర్వర్ మస్తానయ్య

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా అబ్జర్వర్ మస్తానయ్య స్పష్టం చేశారు. సోమవారం చిత్తూరులోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియం లో చీఫ్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అబ్జర్వర్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణ లో చీఫ్‌సూపరింటెండెంట్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. గతంలో జరిగిన తప్పిదాలు పునరావృత్తం కాకూడదని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మాస్‌కాపీయింగ్ జరగకూడదన్నారు. ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్‌లకు చేర్చడంలో కస్టోడియన్‌లదే బాధ్యతని చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో పక్కాగా మౌలిక వసతులు ఉండాలని సూచించారు. డీఈఓ దేవరాజు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 18 నుంచి 30 వ తేదీ వరకు పదోవ తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా రెగ్యులర్‌గా 21,199 మంది ప్రైవేట్‌గా 1,395 మొత్తం 22,594 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని వివరించారు. ఇందుకోసం 116 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

22 మందికి షోకాజ్ నోటీసులు

శిక్షణా కార్యక్రమానికి గైర్హాజరైన 22 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా అబ్జర్వర్ మస్తానయ్య ఆదేశించారు. విధులు కేటాయించినప్పటికీ విస్మరించినందుకు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పరీక్షల నిర్వహణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీవైఈఓ చంద్రశేఖర్, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ చాడేశ్వరి పాల్గొన్నారు.

వేతనమంతా విరాళం!



ఎమ్మెల్యే సమక్షంలో విరాళం అందిస్తున్న పీఎస్ నాగరాజు, సర్పంచ్ లక్ష్మి

వి.కోట : వి.కోట పంచాయతీ సర్పంచ్ పీఎస్ లక్ష్మి తన మూడేళ్ల వేతనాన్ని స్థానిక ఆంజనేయస్వామి ఆలయానికి విరాళంగా అందించారు. సోమవారం ఈ మేరకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు చేతులమీదుగా రూ.లక్ష నగదును ఆలయ ధర్మకర్త నాగరాజేంద్రకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి తన వంతు సాయం చేసినట్లు వెల్లడించారు. దాతను ఎమ్మెల్యే వెంకటేగౌడ అభినందించారు.

అలసత్వం లేకుండా ఎన్నికల విధులు



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : అలసత్వం లేకుండా ఎన్నికల విధులు నిర్వహించాలని, లేకుంటే వేటు తప్పదని కలెక్టర్ షణ్మోహన్ హెచ్చరించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సెక్టోరల్ అధికారులకు సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి నిర్వహించే సమావేశాలకు, శిక్షణా కార్యక్రమాలకు సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. గైర్హాజరైతే చర్యలు కఠినంగా ఉంటాయని స్పష్టం చేశారు. సెక్టోరల్ అధికారులు తమ పరిధిలో రూట్‌మ్యాప్‌ల ప్రకారం పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని సూచించారు. పక్కాగా మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఇందుకోసం సమగ్రశిక్ష శాఖ నుంచి ఎంఈఓలకు నిధులు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. పోలింగ్ రోజున ఈవీఎంలో సమస్యలు తలెత్తితే పరిష్కరించేలా అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. పోలింగ్ సిబ్బంది ముందు రోజు సాయంత్రం 6 గంటలకల్లా కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ రోజున ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ ఉదయం 5.30 గంటల నుంచి 6.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. మాక్‌పోల్ పూర్తి అయిన తర్వాత 7 గంటలకు ఈవీఎంలు సిద్ధంగా ఉండేలా పీఓలకు ఆదేశాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఈవీఎం, వీవీప్యాట్, వినియోగంపై ప్రాక్టికల్ గా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్, ఆర్డీఓ చిన్నయ్య పాల్గొన్నారు.

'స్థానిక' ఆదాయం పెంచేలా ప్రణాళికలు



మాట్లాడుతున్న రత్నకుమారి

చిత్తూరు అర్బన్: జిల్లాలోని పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఆదాయం పెంచే మార్గాలపై ప్రణాళికలు తయారు చేయనున్నట్లు రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్‌పర్సన్ రత్నకుమారి తెలిపారు. ఈ మేరకు అధికారులు సమగ్ర సమాచారం అందించాలని కోరారు. సోమవారం చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జిల్లాలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఫైనాన్స్ కమిషన్ సభ్యులు కృపారావు, ఎంపీఎస్ పద్మారావు, కమిషనర్ అరుణ పాల్గొన్నారు. రత్నకుమారి మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో ఆదాయ మార్గాలు, వాస్తవంగా ఎంత ఆదాయం రావాలి, ప్రస్తుతం ఎంత శాతం వస్తోంది, లోటు ఎంత? మరింత ఆదాయం వచ్చేలా ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. నిధుల లభ్యత, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన గ్రాంట్ల పరిస్థితిని సమీక్షించారు. సమావేశంలో కమిషనర్లు రమణారెడ్డి, మంజునాథ్, ఎంఈ గోమతి, ఏసీపీ రామకృష్ణుడు, ప్రజారోగ్యశాఖ అధికారి లోకేష్ పాల్గొన్నారు

ఆత్మకు శాంతి చేకూరాలని..



మృతుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న తోటి విద్యార్థులు, అధ్యాపకులు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఇటీవల తమిళనాడులోని మహాబలిపురం వద్ద సముద్రంలో మునిగి మృతి చెందిన విషయం విదితమే. ఆ విద్యార్థులకు సోమవారం కళాశాలలో ఘనంగా నివాళులర్పించారు. విజయ్, మౌనీష్, ప్రభు చిత్రపటాలను కళాశాల ఆవరణలో ఉంచి వారి ఆత్మకు శాంతి చేకూరాలంటూ విద్యార్థులు అంజలి ఘటించారు. వారితో స్నేహబంధాన్ని గుర్తు చేసుకుంటూ కన్నీరు పెట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటేశులు, వైస్ ప్రిన్సిపల్ విజయశేఖరం, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రేమ పేరిట వంచించిన యువకుడి అరెస్ట్

కార్వేటినగరం : ప్రేమ పేరుతో ఓ యువతిని వంచించి మరో అమ్మాయితో పెళ్లికి సిద్ధమైన యువకుడిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వివరాలు.. మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన కేశవరెడ్డి కుమారుడు భానుచందర్ (30) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమించానని చెప్పి ఆమెనరు గర్భవతిని చేశాడు. తర్వాత హైదారాబాద్‌కు తీసుకెళ్లి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అబార్షన్ చేయించాడు. ఈ క్రమంలో భానుచందర్ వేరే అమ్మాయిని వివాహం చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. మోస పోయిన యువతి ఫిర్యాదు చేయడంతో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

టెట్ పరీక్ష రాసి ఇంటికి వెళ్తూ..

శ్రీరంగరాజపురం: రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి చెందిన ఘటన మండలంలోని సీకేపురం గ్రామం వద్ద సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. వెదురుకుప్పం మండలం, తార్లబైలు గ్రామానికి చెందిన కేశవరెడ్డి(35) నగరి సూర్య డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. స్నేహితుడు హరితో కలిసి పూతలపట్టు సమీపంలోని వేము ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం టెట్ పరీక్ష రాశారు. బైక్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా.. శ్రీరంగరాజపురం మండలంలోని సీకేపురం గ్రామం వద్ద చిత్తూరు –పుత్తూరు ప్రధాన రహదారిపై వెళ్తున్న చెరుకు ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో కేశవరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన హరిని 108లో చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రధాన రహదారి పక్కన కేబుల్ గోతులు తవ్వడం వల్ల వాటిని తప్పించబోయి ట్రాక్టర్‌ను ఢీకొట్టినట్టు తెలుస్తోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కులాయప్ప తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు



పార్టీలో చేరిన మాజీ సర్పంచ్ రమణారెడ్డితో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ



భద్రాచలం నేతలతో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి: మండలంలోని పెద్దకాప్పల్లె, నిడిగుంట, భద్రాచలం గ్రామాలకు చెందిన పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమవారం ఈ మేరకు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో మాజీ సర్పంచ్ ఆర్లబండ రమణారెడ్డి, అనుచరులు గోవిందప్ప, ఈశ్వర్‌రెడ్డి, మోహన, సంతోష్‌రెడ్డి, మునిరత్నంరెడ్డి, ఎల్లప్ప, నాగరత్నంరెడ్డి, గోవిందు, మోహన్‌రెడ్డి, గణేష్ రెడ్డి ,ఎం.ఎస్. సుబ్రమణ్యం, ఎం.ఎస్.ఆనంద్, ఎం.ఎస్. చిన్న రెడ్డెప్ప, వై. రవీంద్ర, నందిని, చిన్నపాప, రమేష్, నరేష్, హరీష్, సునీత, బాషాజాన్, ప్యారూఖాన్, మునీర్‌బాషా, జబీవుల్లాఖాన్, షమీర్, మస్తాన్‌ఖాన్, సయ్యద్ అన్వర్, సైపుల్లా ఉన్నారు.